క్లుప్తంగా

నేడు నున్నలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నున్న(విజయవాడరూరల్): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కరెంట్ లైన్ల మరమ్మతుల కారణంగా నున్న గ్రామంలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించాలని పేర్కొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

రామవరప్పాడు: రూరల్ మండలం గూడవల్లిలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యాన శనివారం నెక్కలం రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రం-3లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రథసప్తమి సందర్భంగా జిల్లేడు, చిక్కుడు, రేగు ఆకుల ఉపయోగాలు, సూర్యనమస్కారాల ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం 42 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యాధికారి డాక్టర్ కె. సునీత, సిబ్బంది కోటేశ్వరరావు, ప్రదీప్, యోగ శిక్షకులు స్వాతి, డ్వాక్రా వీఓఏ సుజాత, అంగన్వాడీ టీచర్ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ రంగంలో ఉద్యోగ అవకాశాలు

రామవరప్పాడు: ఫార్మసీ రంగంలో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఎల్వీ గంగాధరరావు అన్నారు. ఎనికేపాడులోని విజయ మహిళ ఫార్మసీ కళాశాలలో మొదటి సంవత్సరం బీ ఫార్మసీ, ఫార్మా డీ విద్యార్థినులకు వారం నుంచి నిర్వహిస్తున్న వ్యక్తిత్వ వికాస తరగతులు శనివారం ముగిశాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా బాలఏసు ఉత్సవాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక జ్యోతినగర్‌లోని ఆర్సీఎం చర్చిలో దివ్య బాలఏసు మహోత్సవాలు ఏడోరోజు శనివారం ఘనంగా జరిగాయి. ఫాదర్ చేబ్రోలు జోసఫ్ తంబి ఆధ్వర్యంలో ఘనంగా దివ్య పూజ సమర్పించగా, ఫాదర్ జి.ప్రవీణ్ దైవ సందేశమిచ్చారు. జేఎంజే సిస్టర్స్ బాలఏసు గీతాలను ఆలపించగా, చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఫాదర్ పీకే జోసఫ్, సిస్టర్స్ ఆంథోనమ్మ, మంజుల, మేరీ, బాల పాల్గొన్నారు.

విచక్షణారహితంగా ఎరువులు వాడొద్దు

పెనమలూరు: మొక్కజొన్న సాగులో రైతులు విచక్షణా రహితంగా ఎరువులు వాడొద్దని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. ఆమె శనివారం తాడిగడపలో మొక్కజొన్న పొలాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మొక్కజొన్నసాగులో రైతులు ఎక్కువగా యూరియా వాడుతున్నారని, దీంతో కత్తెర పురుగు, కాండం తొలిచే పురుగు, చీడ సమస్య ఉధృతమవుతుందన్నారు.

వీఆర్వోల సమావేశం

అంబాపురం(విజయవాడరూరల్): రూరల్ రెవెన్యూ అధికారుల సమావేశం శనివారం అంబాపురంలో జరిగింది. రెవెన్యూ అధికారుల మండల అధ్యక్షుడు ఎంవీఎస్ చక్రధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం ప్రతినిధులు శ్రీనివాసరావు, నాగేంద్రబాబు వీఆర్వోలు పాల్గొన్నారు. అనంతరం సర్పంచి గండికోట సీతయ్యకు సన్మానం చేశారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



నిడమానూరులో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్

రామవరప్పాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా పాలన చేస్తున్నారని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరు సచివాలయం-2లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. నెహ్రూనగర్, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. ప్రతి గడప వద్ద జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు వాటి అమలు తీరును వివరించారు. ఆ ప్రాంతవాసులు స్థానిక సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై ఎమ్మెల్యే వంశీమోహన్ పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్‌ను వివరణ కోరారు. సమస్యాత్మకంగా మారిన ప్రాంతాల్లో వెంటనే అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. కొన్ని దరఖాస్తులను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. విద్య, వైద్యం, ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పలువురికి సొంత నిధులతో ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, సర్పంచ్ శీలం రంగారావు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, గ్రామ కన్వీనర్ పరిమి వంశీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్. వెంకటేశ్వరరావు, ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు, అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో తిరునాళ్లకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: సమన్వయంతో పని చేసి వీరమ్మ తిరునాళ్లను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఈనెల 31వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్లపై మున్సిపల్ కార్యాలయంలో శనివారం ప్రభుత్వ శాఖల అధికారులతో ఎమ్మెల్యే పార్థసారథి సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అమ్మవారి గ్రామోత్సవాన్ని సిద్ధం చేసిన రూట్ మ్యాప్ ప్రకారం నిర్వహించాలన్నారు. ఊరేగింపు రూట్‌ను కమిటీ సభ్యులు, అధికారులతో చర్చించి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్యం, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ తదితర అంశాలపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. భక్తులకు వసతుల కల్పనలో సమస్య తలెత్తితే సహించబోమని హెచ్చరించారు. సమావేశంలో కమిటీ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, సీఐ పరమేశ్వర్, కమిషనర్ పి.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ మస్తాన్, ఎంపీడీఓ ఉమాదేవి, విద్యుత్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహా సౌరయాగం



విజేతలకు సర్టిఫికెట్లు అందజేసిన ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు నరసింహారావు తదితరులు

పెనమలూరు: యనమలకుదురులోని శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామిదేవస్థానంలో శనివారం మహాసౌరయాగం ఘనంగా చేశారు. ఆలయంలో ఉదయం 6 గంటలకు శ్రీ సూర్యనారాయణస్వామికి అభిషేకం, అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 9 గంటలకు 108 సూర్యనమస్కార పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు, నాగార్జున యూనివర్సిటీ యోగా గురువు డి.రాధిక, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ గౌరవ అధ్యక్షుడు జి.రామకృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాత.. భాస్కరా నమోనమః



శ్రీసీతారామచంద్రస్వామికి ప్రత్యేక పూల అలంకరణ



ఈడుపుగల్లులో యోగ విన్యాసాలు చేస్తున్న నలంద విద్యార్థులు

దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజీగూడెంలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీసూర్యనారాయణమూర్తికి ప్రత్యేక హోమం చేసి, పొంగళ్లు నివేదించారు. అనంతరం ఆలయ అర్చకుడు రామాచార్యులు నేతృత్వంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు.

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ప్రసిద్ధి దేవస్థానం చినకంచిలో సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక అర్చనలు జరిగాయి. రూరల్ ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి ట్రస్టీ మొక్కపాటి శర్మ, తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

నలందలో రథసప్తమి వేడుకలు

కంకిపాడు: ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్‌లో రథసప్తమి పర్వదినాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన యోగ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ జె.పద్మావతి మాట్లాడుతూ యోగ మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమాన్ని పాఠశాల ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

గన్నవరం రూరల్: మండలంలోని చిక్కవరం శ్రీ ఉషా పద్మిని సమేత సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో శనివారం రథసప్తమి పండుగ పురస్కరించుకుని సూర్యకిరణాలు స్వామి వారి పాదాలు తాకాయి. ఆలయ నిర్వాహకులు వంశీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. రథసప్తమి రోజు స్వామి వారి పాదాలు తాకిన సూర్య కిరణాలు దర్శనంతో తరించామని భక్తులు చెప్పారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రామవరప్పాడు: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సిటీ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రమణమూర్తి అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ఫలితాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐలు శ్రీధర్‌కుమార్, నాగ శ్రీనివాస్, సెబ్ సీఐ స్వామినాథన్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ సామగ్రిని సకాలంలో అందించాలి

ఉంగుటూరు: గృహనిర్మాణ లబ్ధిదారులకు అవసరమైన సిమెంటు, ఇసుక, ఇనుము సకాలంలో అందజేయాలని జిల్లా ఎస్టీ వెల్ఫేర్ ఆఫీసర్, మండల ప్రత్యేక అధికారి ఫణి ధూర్జటి అన్నారు. వేమండలో జగనన్న కాలనీలో గృహనిర్మాణాల పురోగతిని శనివారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు, సర్పంచ్ నిర్మల, ఈవోఆర్‌డీ బాషా, కార్యదర్శి ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

పెనమలూరు: పోడవరంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని లయన్ రావి సురేష్‌బాబు తెలిపారు. ఆయన శనివారం విలేకరులకు వివరాలు తెలిపారు. గ్రామంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మండల పరిషత్ పాఠశాల ఆవరణలో వైద్య శిబిరం ఉంటుందన్నారు. నరాలు, గుండె, గర్భిణుల సమస్యలు, మధుమేహం, ఇతర వ్యాధులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు.

• పూర్వ విద్యార్థుల సందడి



ఎస్సార్కే ఇన్‌స్టిట్యూట్‌లో పూర్వ విద్యార్థులు

రామవరప్పాడు : ఎనికేపాడులోని ఎస్సార్కే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల కలయిక సందడిగా జరిగింది. కళాశాలలో వివిధ విభాగాల్లో ఇంజినీరింగ్ పూర్తి చేసి దేశ, విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సుమారు 208 మంది కళాశాలలో కలుసుకుని ఉత్సాహంగా గడిపారు. ఏటా జనవరిలో ఆత్మీయ కలయిక నిర్వహించడానికి నిర్ణయించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. ఏకాంబరం నాయుడు, కళాశాల సెక్రటరీ బోయపాటి శ్రీకృష్ణ, డాక్టర్ బి. కృష్ణయ్య, హెచ్‌డీవోలు పాల్గొన్నారు.

బాలోత్సవాలకు మానవత సభ్యుల విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్: చిన్నారుల్లో సృజన పెంపొందించడానికి హేలాపురి బాలోత్సవాలు తోడ్పడతాయని మానవత స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. ఏటా ఏలూరులో ఘనంగా నిర్వహించే హేలాపురి బాలోత్సవాలకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రూ.45 వేలు విరాళం అందజేసింది. మానవత జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు రూ.25 వేలు విరాళం అందించగా, హనుమాన్‌జంక్షన్ శాఖ తరపున సభ్యులు మరో రూ.20 వేలు విరాళం అందించారు. ఈ మొత్తాన్ని హేలాపురి బాలోత్సవం నిర్వాహక కమిటీ అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావుకు శనివారం మారుబోయిన అందజేశారు. మానవత సభ్యులు పాల్గొన్నారు.

55 మందికి కంటి పరీక్షలు




కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

కంకిపాడు: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మండలంలోని ఈడుపుగల్లులో రెండు ప్రాంతాల్లో శనివారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ అధ్వాతాతలు 55 మందికి కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కంటి సమస్యలు ఎదుర్కొంటున్న వారికి చుక్కల మందు అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పీవీఆర్వీ ఆంజనేయులు, టి.శ్యామల, టి.రాజకుమారి, మార్తమ్మ, కనకదుర్గ, జయలక్ష్మి, జగదీష్, సుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలతో విజయం

ఉయ్యూరు: నైతిక విలువలతో కూడిన విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక శ్రీ శ్రీనివాసా విద్యాసంస్థల్లో ప్రజానాట్యమండలి ఆధ్వర్యాన శనివారం బాలోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ అంశాల్లో ప్రతిభా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఉందన్నారు. పోటీ ప్రపంచంలో ఇంటర్నెట్, సెల్‌ఫోన్, ఇతర ప్రచార మాధ్యమాలకు విద్యార్థులు, యువత బానిసలుగా మారడం మంచి పరిణామం కాదని చెప్పారు. ప్రతి విద్యార్థి నడవడిక మార్చుకుని ముందుకు సాగితే విజయం సాధ్యమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పరుచూరి శ్రీనివాసరావు, కాగిత చినబాబు, డాక్టర్ చంద్రశేఖర్, విశ్వమోహన్, పరుచూరి నీలిమ, శ్యామలాదేవి పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ప్రజానాట్యమండలి ప్రతినిధి కొండలు పర్యవేక్షించారు.

లింగ నిర్ధారణ చట్ట విరుద్ధం



స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ విజయ్‌కుమార్

ఉయ్యూరు: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్ట విరుద్ధమని ఉయ్యూరు ఆర్డీఓ ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులతో శనివారం సమావేశం నిర్వహించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ గర్భిణులకు స్కానింగ్ చేసేటప్పుడు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. డెప్యూటీ డీఎంహెచ్ఓ సుదర్శన్‌బాబు మాట్లాడుతూ గర్భిణులకు స్కానింగ్ తీసే సమయంలో హై రిస్క్ ఉన్నట్లు తేలితే వెంటనే వైద్యులను సంప్రదించి సేవలు పొందాలని సూచించాలన్నారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు నిర్వహణ తీరుపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఆరోగ్య సిబ్బంది, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను పట్టుకునేందుకు ఐదు బృందాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: శేరినరసన్నపాలెంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కైలే జ్ఞానమణి నివాసంలో జరిగిన చోరీ ఘటనపై విచారణ వేగవంతం చేశామని డీఎస్పీ కె. విజయ్‌పాల్ చెప్పారు. పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌తో కలిసి శనివారం చోరీ జరిగిన ఇంటిని మరోసారి పరిశీలించారు. నిందితులను పట్టుకునేందుకు ఐదు ప్రత్యేకబృందాలు నియమించినట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీపై కేసు

కంకిపాడు: ద్విచక్ర వాహనం చోరీ ఘటనపై స్థానిక పీఎస్‌లో శనివారం కేసు నమోదైంది. పునాదిపాడు గ్రామానికి చెందిన కుంభా రవితేజ స్థానికంగా ఉన్న ఫ్లై ఓవర్ వద్ద పండ్ల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ నెల 26వ తేదీ రాత్రి తన దుకాణం వెలుపల బైక్ నిలిపి దుకాణంలో నిద్రించాడు. తెల్లవారి చూసేసరికి బైక్ కనిపించలేదు. స్థానికంగా విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో బైక్ చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన కారు

ఉంగుటూరు: చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో శనివారం ఓ మహిళకు తీవ్ర గాయలయ్యాయి. విజయవాడకు చెందిన నాగేంద్రకుమార్ భార్యతో కలిసి కారులో ఏలూరు నుంచి విజయవాడ వైపు వస్తున్నారు. ఉంగుటూరు మండలం పొట్టిపాడు వద్ద ఫ్లై ఓవర్‌పై ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొంది. ఘటనలో భార్య రాధిక తీవ్రంగా గాయపడగా నాగేంద్రకుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఆత్కూరు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.